క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాల భైరవాష్టమి పూజ


కురంగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

తాళ్లరేవు: పాత కోరంగిలో వేంచేసి యున్న బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కాలభైరవాష్టమి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాలభైరవ అష్టమి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు సాయిప్రసాద్ స్వామి వారికి వివిధ రకాలైన ద్రవ్యములు, పండ్ల రసాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం


బాధితురాలికి గృహోపకరణ సామగ్రి అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ముమ్మిడివరం: ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి రూ.50 వేలు ఆర్థిక సాయం లభించింది. ముమ్మిడివరం నగర పంచాయతీ 20 వార్డుకు చెందిన కొప్పిశెట్టి భూలక్ష్మి ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురి కావడంతో బాధితురాలు సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న హైదరాబాద్‌కు చెందిన జీఎంఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు గుత్తుల మీరా కుమార్, కార్యదర్శి పిల్లి నాగ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.50 వేల విలువ గల గృహోపకరణాలను సమకూర్చారు. వీటిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి చేతుల మీదుగా ట్రస్టు సభ్యులు ఆదివారం బాధితురాలికి అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: మండల పరిధిలోని కోరంగి పంచాయతీలో గల హోప్ ఐలాండ్ దీవిలో ఆదివారం ఆప్రాస్కాన్–2024 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాడిమొగ పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డా.నరసింహనాయక్, ఆప్రాస్కాన్ సంస్థ అధ్యక్షుడు డా.డీవీ కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 120 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 10 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించామని వారికి ఐరన్ మాత్రలతో పాటు నులిపురుగు మందులను అందజేసినట్లు నరసింహనాయక్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు, త్రిమూర్తులు, నూకరాజు, రమేష్ పాల్గొన్నారు.

డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం


కోనసీమ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం అమలాపురం రథసారథి యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యానందం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ విధి విధానాల గురించి, డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు పాలమూరు చందు, ఉపాధ్యక్షుడు దంగేటి దుర్గాప్రసాద్, కార్యదర్శి మందా దుర్గారావు, జనరల్ సెక్రెటరీ నక్కా రాజేష్, ముఖ్య సలహాదారు కడలి జగదీష్, అకౌంటెంట్ ఎర్రా నరసింహస్వామి, కొండేపూడి సాయిబాబు, జంగా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలి

యానాం: రీజెన్సీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్య జరిగిన అగ్రిమెంట్ మేరకు దొమ్మేటిపేట సమీపంలో కార్మికులకు కేటాయించిన కాలనీ అసంపూర్తి పనులు పూర్తి చేయాలని ఆదివారం రీజెన్సీ సిరామిక్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇటీవలి జరిగిన సమావేశంలో ఫ్యాక్టరీ ఎండీ నాయుడు రీజెన్సీ కార్మికుల కాలనీ సిద్ధమైందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులకు కేటాయించిన భూమిని అభివృద్ధి చేసి ఇవ్వాలన్నది రీజెన్సీ సంస్థల ఎండీ జీఎన్ నాయుడు, యూనియన్ నాయకులకు మధ్య ఒప్పందమని అన్నారు. మధ్యవర్తులు, యూనియన్ నేతలను పిలిపించి కార్మికుల కాలనీ పనులను అగ్రిమెంట్ మేరకు పూర్తి చేయాలని కోరారు.

చెరువు ప్రారంభం ఎన్నడో..!

- రూ.1.07 కోట్లతో ఆధునీకరణ
- విద్యుత్ పనుల పేరుతో తాత్సారం
- అందుబాటులోకి వస్తే ఆహ్లాదం
- పాలకులకు కొరవడిన చిత్తశుద్ధి


ఆధునీకరణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి ఎదురు చూస్తున్న గరిగుంట చెరువు

అమలాపురం టౌన్: అది మున్సిపాలిటీలోని 8 వార్డులో గల గరిగుంట చెరువు. ఒకప్పుడు దాదాపు ఏడెకరాల విస్తీర్ణంతో నిండైన చెరువుగా కళకళలాడేది. కాల క్రమంలో చెరువు గర్భం ఆక్రమణలకు గురి కావడంతో విస్తీర్ణం రెండెకరాలకు బక్క చిక్కింది. గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు పెరిగి దుర్భరంగా మారింది. చెత్తా చెదారాలు పెరిగిపోవడంతో పందులు, దోమలకు ఆవాసాలుకు మారింది. ఆ ప్రాంత ప్రజలు ఈ చెరువును ఆధునీకరించి పార్కుగా మార్చి వాకింగ్ ట్రాక్ నిర్మించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలోనే బక్క చిక్కిన ఆ చెరువు విస్తీర్ణంలోనే దాదాపు సగ భాగం ఓం శాంతి కేంద్ర భవనానికి కేటాయించడంతో అక్కడ అందమైన పెద్ద భవంతి నిర్మితమైంది. మిగిలిన చెరువు స్థలాన్ని పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా ఓ ఉద్యాన వనాన్ని నిర్మించాలన్న ప్రజల ఆకాంక్ష బలపడింది. దీంతో 8వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. రెండేళ్ల కిందట అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కృషి సైతం చెరువు ఆధునీకరణ ప్రయత్నానికి తోడైంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం అమలులోకి రావడం, ఆ పథకం ద్వారా విడుదలైన రూ.1.7 కోట్ల వ్యయంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దుర్గంధంతో ఉన్న చెరువు స్థలం పూర్తి ఆధునీకరణకు నోచుకుంది. అందమైన ఉద్యానవనం, వాకింగ్ ట్రాక్, చుట్టూ ఫెన్సింగ్, స్వచ్ఛమైన నీటితో చెరువు ఆద్యంతం ఆకర్షణీయంగా మారింది. ఆ పథకం ద్వారా విడుదలైన నిధులతో చెరువు గట్లను ఎత్తు చేయడం, చెరువులోని పూడికలు తీయించడం, వాకింగ్ ట్రాక్ నిర్మించడం, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వంటి పనులతో ఆ చెరువు పాత ఆనవాళ్లు మచ్చుకైనా లేకుండా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం పూర్తి స్థాయిలో ఆధునీకరించింది. ఇదే సమయంలో ప్రస్తుత కౌన్సిలర్ వెంకటేష్ ప్రయత్నంతో అప్పటి మంత్రి విశ్వరూప్ కృషితో ఆధునీకరించిన చెరువు చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు రూ. 30 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేయించారు. ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించి దానిని ప్రారంభించేందుకు సన్నహాలు కూడా జరిగాయి. రూ.30 లక్షల నిధులు మంజూరు అవుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఈ ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి.

ఆరు నెలలు కావస్తున్నా అతీగతీ లేదు

గత ప్రభుత్వంలో ఆధునీకరించిన చెరువును ప్రారంభించేందుకు కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల కావస్తున్నా స్థానిక ఎమ్మెల్యేకు, టీడీపీ, జనసేన నాయకలకు దీనిని ప్రారంభించాలన్న ధ్యాసే లేకుండా పోయింది. ఇప్పటికే అభివృద్ధి చెంది ఉన్న చెరువుకు లైటింగ్ వంటి పనులు చేపట్టి త్వరిత గతిన ప్రారంభించి ప్రజలకు ఆహ్లాదభరితమైన వాతావరణాన్ని అందించాలన్న ఆలోచన కరవైంది. ఆధునీకరణ పూర్తయినా ప్రారంభానికి ప్రజలు నిరీక్షించే పరిస్థితిని కల్పించారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం

అమృత్ 2.0 పథకంతో ఆధునీకరించిన గరిగుంట చెరువుకు త్వరలోనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తాం. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో లైటింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నాం. చెరువు విద్యుదీకరణ జరిగిన తర్వాత ప్రారంభోత్సవం జరగుతుంది.
– వి.కృష్ణ, ఏఈ, అమలాపురం మున్సిపాలిటీ.

ప్రహరీ అవసరం

ఆధునీకరించిన చెరువు చుట్టూ 40 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు గత ప్రభుత్వంలోనే అంచనాలు సిద్ధమయ్యాయి. దీనికి గానూ రూ.30 లక్షలతో అంచనాలు తయారు చేశారు. అయితే మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి అరకొరగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పరిస్థితి కనిపిస్తోంది. చెరువు అన్ని వైపులా విస్తరించేలా విద్యుత్ వెలుగులతో పాటు చెరువు చుట్టూ మూడు లేదా నాలుగు అడుగుల ఎత్తు గోడ, దానిపై ఎలివేషన్ వర్కు చేయాల్సి ఉంది. ఎందుకంటే చెరువుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినప్పటికీ రోడ్ల మీద నుంచి పశువులు రాకుండా ప్రహరీ నిర్మాణం అత్యవసరమని స్థానికులు సూచిస్తున్నారు. ప్రహరీ లేకపోతే వాకింగ్ ట్రాక్‌పై నడిచే వాకర్స్‌కు పశువుల వల్ల అసౌకర్యంగా ఉంటుందన్నది ప్రజల అభిప్రాయం. చెరువు చుట్టూ పచ్చటి మొక్కలు పెంచి మరింత ఆహ్లాదాన్ని ప్రజలకు అందించాల్సి ఉంది. దాదాపు 95 శాతం పనులు పూర్తి కావడంతో ఆధునీకరణ పూర్తి చేసుకొని ఏడాది కాలంగా ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న ఈ చెరువును తక్షణమే ప్రాంరంభించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు


ఎన్.కొత్తపల్లి షష్ఠి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విద్యుద్దీపాలంకరణ

ఐ.పోలవరం: మురమళ్లలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు ఉదయం పవిత్ర గౌతమీ గోదావరిలో నాగాభట్ల రామకృష్ణమూర్తి, అపర్ణ దంపతుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. త్రిశూల స్నానానికి పల్లకీలో ఊరేగింపుగా తరలి వెళ్లారు. అనంతరం రాత్రి పుష్పోత్సవాన్ని పండితులు జరిపించారు. గుత్తినదీవి వేమవరంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగుతున్నాయి. శనివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి ఉత్సవాలు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షష్ఠి ఉత్సవాలను రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో తీర్థం ఏర్పాటు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ సెట్టింగులతో ఏర్పాటు చేసిన లైటింగ్‌ను వీక్షించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.


మురమళ్ల సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గోదావరిలో త్రిశూల స్నానం

యాదవుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి వెంకటరమణ

అల్లవరం: అమలాపురం నియోజకవర్గ యాదవ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని సంఘ అధ్యక్షుడు కైలా శోభన్‌బాబు అధ్యక్షతన ఓడలరేవులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘ ప్రతినిధులు పలు వినతులను ఎమ్మెల్యే ముందు ఉంచారు. యాదవ కులవృత్తి గోవుల పెంపకమని, డైరీ ఫాంలో రిజర్వేషన్లు కల్పించి నిధులు కేటాయించాలని కోరారు. మేకలు, గొర్రెల పెంపకం దారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించాలని, నామినేటెడ్ పదవుల ఎంపికలో యాదవులకు అవకాశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎమ్మెల్యే ఆనందరావు బదులిస్తూ యాదవుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సోమాని వెంకటరమణ, సభ్యులు కోరశిక సుబ్రహ్మణ్యం, మందపాటి రామకృష్ణ, మన్నె వెంకటేశ్వరరావు, దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో రుణాలు మాఫీ చేయాలి


బోడసకుర్రులో టిడ్కో గృహాల లబ్ధిదారులతో సీపీఎం నాయకులు

అల్లవరం: టిడ్కో గృహాలపై లబ్ధిదారులు తీసుకున్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. అల్లవరం మండలం బోడసకుర్రులోని టిడ్కో గృహాలను సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. బ్యాంక్ అధికారులు బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ లబ్ధిదారులను వేధింపులకు గురి చేస్తున్నారని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆరోపించారు. బ్యాంక్ అధికారుల తీరుకు నిరసనగా టిడ్కో భవనాల వద్ద సమావేశం నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ 20 ఏళ్ల పాటు ప్రతి నెల రూ.4 నుంచి రూ.5 వేలు చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. టిడ్కో గృహాల నిర్మాణ సమయంలో రూ.1.50 లక్షల వరకు అప్పులు చేసి చెల్లించామని, అప్పుడు చేసిన అప్పుకు నేటికీ వడ్డీలు కడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు టీడీపీ పార్టీ టిడ్కో రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని సీపీఎం నాయకులకు బాధితులు తెలిపారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. దీనిపై సీపీఎం నాయకులు మాట్లాడుతూ టిడ్కో గృహాలకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ అధికారుల వేధింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. బాధితులకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు ఎస్.బలరాం, నాగ వరలక్ష్మి, అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

వెనామీలో విజృంభిస్తున్న వైరస్ వ్యాధులు


వాతావరణ మార్పులకు ఆక్సిజన్ లోపించడంతో పట్టుబడి చేస్తున్న చేపలు

కాట్రేనికోన: తుపాను ప్రభావంతో ఏర్పడిన వాతావరణ మార్పులు, విద్యుత్ కోతలతో రొయ్యల చెరువుల్లోని రొయ్యలు, చేపలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పక్షం రోజులుగా వాతావరణంలో మబ్బులు, వర్షాలు, ఈదురు గాలులతో చెరువులలోని ఆక్సిజన్ స్థాయి పడిపోవడం, కరెంట్ కోతలు అధికం కావడంతో ఆక్సిజన్ లోపం వచ్చి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు, మామిడికుదురు, రాజోలు, మల్కిపురం మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. మిశ్రమ పద్ధతిలో చేపల సాగు, పాలికల్చర్(రొయ్యలు, చేపల సాగు), వనామీ రొయ్యల రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. వాతావరణంలోని మార్పులతో చెరువు నీటిలోని ప్లాంటేషన్ చనిపోవడంతో నీరు పలచబడి నేరుగా సూర్యరశ్మి చెరువు అడుగు భాగానికి చేరుతుంది. చెరువు అడుగు మట్టి పాడైపోవడంతో లాబ్ వంటి మట్టి తెట్టులుగా పైకి చేరుతుంది. దీంతో చెరువు నీటి నాణ్యత, మట్టి నాణ్యత దెబ్బతింటుంది. చెరువుల్లోని ప్లాంటేషన్ క్రాస్ కావడంతో జలచరాలు మేతలు సకాలంలో తినడం లేదు. చేపలు, రొయ్యలు తినగా మిగిలిన మేత చెరువు అడుగు భాగానికి చేరి కుళ్లిపోవడంతో అమ్మోనియం, నైట్రేట్ వంటి విషవాయువులు తయారవుతున్నాయి.

ఆక్సిజన్ స్థాయి తగ్గడంతో మృత్యువాత

చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రొయ్యల సాగులో ఆక్సిజన్ స్థాయిని పెంచేందుకు చెరువులలో రైతులు ఏరియేటర్లతో ఆక్సిజన్‌ను అందిస్తారు. అయితే ఎండలకు తోడు కరెంట్ కోతలు అధికం కావడంతో చెరువులోని ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రొయ్యల చెరువులలో వైరస్ వ్యాధులు సోకడంతో చిన్న సైజ్‌లోనే వెనామీ రొయ్యలను పట్టుబడి చేయవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

వ్యాధుల విజృంభణతో నష్టం

తుపానుతో చలి గాలులు, మబ్బులతో వాతావరణం పూర్తిగా చల్లబడి పోవడంతో వైరస్ వ్యాధులు విజృంభించడంతో వెనామీ రొయ్యలు చిన్న కౌంట్‌లోనే చనిపోతున్నాయి. దీనికి తోడు కరెంట్ కోతలతో ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది.
బి.వెర్రిబాబు, ఆక్వా రైతు, ఎస్ కొత్తపల్లి.

పూడ్చని గోతులతో ప్రమాదాలు

యానాం: పట్టణంలో ఇంటింటికి గ్యాస్ పంపిణీ పథకంలో భాగంగా వేస్తున్న గ్యాస్ పైపులైను కోసం తవ్విన గోతులను సరిగ్గా పూడ్చకుండా వదిలి వేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానిక సోషల్ యాక్టివిస్ట్ పెద్దిరెడ్డి బాబి తెలిపారు. స్థానిక న్యూ బస్టాండ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు అందులో ప్రమాదవశాత్తు పడిపోయి గాయాల పాలవుతున్నారన్నారు. ద్రాక్షారామ రోడ్డు, మెట్టకూరు రహదారి తదితర ప్రాంతాల్లో గోతులు ప్రమాదకరంగా మారాయన్నారు. తక్షణం సంబంధిత సంస్థ చర్యలు తీసుకోవాలని కోరారు.

అణువణువులో వ్యాపించిన శ్రీకృష్ణుడు

అయినవిల్లి: అనంతకోటి బ్రహ్మండంలో అణువణువు శ్రీకృష్ణుడే వ్యాపించి ఉన్నాడని, శ్రీకృష్ణుడు జపం చేసిన, ఆయన సేవలు ఉన్న వారిని ఎల్ల వేళలా కాపాడుతూ ఉంటారని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించిన వారికి అనుక్షణం ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. శ్రీకృష్ణుడు ప్రసాదించిన జ్ఞానంతో సంతోషంతో సుఖజీవనం సాగించవచ్చన్నారు. స్వామివారి లీలా మృతం వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నాను విజయవంతం చేయాలి


అమలాపురం ఎల్ఐసీ కార్యాలయం వద్ద వాల్ పోస్టర్ అతికిస్తున్న యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈ నెల 10న రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద జరుప తలపెట్టిన ధర్నాలో జిల్లా నుంచి ఏజెంట్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అమలాపురం యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఆవరణలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను యూనియన్ ప్రతినిధులు ఆదివారం అతికించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జి.వినాయకరావు, కోశాధికారి దొమ్మేటి శివస్వామి, ఎం.దుర్గా శ్రీనివాస్, పిడక దుర్గాదేవి, శీలం లంకేశ్వరుడు పాల్గొన్నారు.

అలరించిన అంబేడ్కర్ నృత్య నాటకం


అంబేడ్కర్ నాటకంలో ఓ సన్నివేశం

తాళ్లరేవు: అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలోని కెవిఎస్ కన్వెన్షన్ హాల్లో శనివారం రాత్రి అంబేడ్కర్ జీవిత చరిత్రపై హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి అనే నృత్య నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు ప్రదర్శించిన నాటకం ఆద్యంతం అలరించింది. అంబేడ్కర్ జీవితాన్ని కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, ముద్దన వెంకట శివరామప్రసాద్, రెడ్డిబాబు, విళ్ల వీర, పెయ్యల రమేష్, యడ్ల కుటుంబరావు, దడాల సువర్ణలత, విప్పర్తి శ్రీనివాస్, పి.కృష్ణ, మురళి, సోను, చంటి, అర్జున్, వాసు, రవీంద్ర, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తుపాను నష్టం పరిశీలన

యానాం: ఫెంగల్ తుపానుతో జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం ఆదివారం పుదుచ్చేరి నుంచి కడలూరు వరకు కలెక్టర్ కులొంత్తున్‌తో కలిసి పర్యటించారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, వరదలకు పుదుచ్చేరి, కారైకల్, యానాం ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. రైతులు, మత్స్యకారులు, వ్యాపారస్తులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా కలెక్టర్ కులొంత్తున్ బృందంతో మాట్లాడుతూ.. తుపాను, వరదల వల్ల పుదుచ్చేరి, కారైకల్, యానాం రీజియన్‌లు తీవ్రంగా నష్టపోయాయని తెలిపారు. వందలాది హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని వివరించారు. ఇప్పటికే రేషన్‌కార్డు దారులు ఒక్కొక్కరికీ రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని సీఎం రంగసామి ప్రకటించారని తెలిపారు. పంట నష్టానికి సంబంధించి నివేదికను సిద్ధం చేసినట్లు తెలిపారు. బృంద సభ్యులు సోమవారం ఎల్జీ కె కైలాష్‌నాథన్‌తో సమావేశమై అనంతరం చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి నివేదిక అందజేయనున్నారు. కేంద్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న మినిస్టరీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి రాజేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందక ఇక్కట్లు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, డీగ్రీ కళాశాలల్లో చదివే ఎస్సీ విద్యార్థులకు రెండు విద్యా సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఉపకార వేతనాల బకాయిలు మంజూరు చేయడం లేదని ఆదివారం పలువురు ఎస్సీ విద్యార్థులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలకు సంబంధించి రెండు విడతలుగా ఆది ద్రావిడ శాఖ ద్వారా ఉపకార వేతనాలు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. కాని కొంతమంది విద్యార్థులకు ఒక్క విడత డబ్బులు రూ.8వేలు చొప్పున మాత్రమే వేశారన్నారు. మిగతా సొమ్ము ఒక్కొక్కరికీ సుమారు పన్నెండు వేల చొప్పున బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. తక్షణం పుదుచ్చేరి ప్రభుత్వం, ఆది ద్రావిడ శాఖలు స్పందించి ఉపకార వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అయినవిల్లి: మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలం చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు ఆదివారం చేయూతనందించారు. జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వీరవెంకట్రావు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో సర్వం కాలిపోయి బూడిదై రోడ్డున ఆరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.పది వేలు, ఒక్క దుప్పటి అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కండెల్లి సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారా వు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈతకోట వీవీ సత్యనారాయణ, నాయకులు లంకకొండద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.